ప్రజాశక్తి
ఆదివారం 29 అక్టోబర్ 2023 8 పేజీలు


గుంటూరు


పల్నాడు

# మంత్రి మాట నీటి మూట

- అమలుకు నోచని ఆరుతడులకు నీటి సరఫరా
- బెట్టకొస్తున్న పైర్లను చూసి రైతు కన్నీరు
- ఆశ చావక ట్యాంకర్ల ద్వారా పైరును బతికించుకునే ప్రయత్నం

**అరు తడి పంటలకు నీరిస్తామనే మంత్రి నీటిమూటగా మారింది.. ఎంతో ఆశతో రైతులు వేసిన పంటలకు నీటి తడులు అందక నష్టాలు మూటగట్టుకుంటున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి వేసిన పైర్లు బెట్టకు వస్తుంటే రైతులు గుండెలు బాదుకుంటున్నారు.**


బెట్టకొచ్చి ఎదుగుదల లోపించిన మిర్చి పైరు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో 7.60 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా ఖరీఫ్‌లో ప్రతి ఏటా 5.12 లక్షల ఎకరాలు సాగు అవుతుంది. రబీ నాటికి 90 శాతం వరకు సాగు చేసేవారు. అయితే ఈ ఏడాది వర్షాభావం, కాల్వలకు నీరు రాని కారణంగా ఇప్పటి వరకు 3.8 లక్షల ఎకరాలే సాగవ్వగా ఆయా భూముల్లో మిర్చి, పసుపు, పత్తి మొక్కజొన్న తదితర పంటలేశారు. గతేడాది సాగు విస్తీర్ణం 78 శాతం కాగా ఈ ఏడాది 55 శాతమే. వీటిల్లో మిర్చి 50,187 ఎకరాలు, పసుపు 332 ఎకరాలు, ఉద్యాన, ఇతర పంటలు 4,415 ఎకరాలు, పత్తి 65,301 ఎకరాలు, పొగాకు 765 ఎకరాలు, అపరాల 18,768 ఎకరాల్లో రబీ పంటలేశారు.


కత్తెర పురుగు సోకి దెబ్బతిన్న మొక్కజొన్న

నాగార్జునసాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు సాగునీరు ఇవ్వబోమని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు చాలా మంది వరి సాగను నిలిపివేశారు. ఆరుతడి పంటలకు నీరిస్తామని ప్రకటన ఆధారంగా పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ కుడికాల్వ ఆయకట్టు కింద 2.5 లక్షల ఎకరాలకు పైగా రైతులు మిరప, మొక్కజొన్న, పొగాకు, పత్తి, వంటి వాణిజ్య పంటలతో పాటు కంది మినుము, పెసర, అలసంద వంటి అపరాల సాగు చేపట్టారు. అయితే రెండు నెలలుగా చుక్క నీరు లేకపోవడం, కాల్వల ద్వారా సరఫరా చేయకపోవడం వల్ల ఆ పైర్లన్నీ ఎండిపోతున్నాయి. అయితే రైతుల్లో ఆశ చావక మొక్కలను బతికించుకునేందుకు తంటాలు పడుతున్నారు. మరో పది రోజులకైనా వర్షాలు

▶ 2లో


నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

## డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-గుంటూరు

కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి నిరసనగా స్థానిక ఎన్‌టిఆర్ బస్టాండ్‌లో ఆర్టీసి ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్ మాట్లాడుతూ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన దుండుగుల్ని వెంటనే అరెస్ట్ చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులపై తరచుగా ఇలాంటి భౌతిక దాడులు జరుగుతున్నా యాజమాన్యం ఉదాసీనంగా వ్యవహరించటం వల్లే ఇలాంటివి పునరావృతం అవుతున్నాయని విమర్శించారు. దుండగులు ఏమాత్రం మానవత్వం లేకుండా అమానుషంగా దాడి చేశారని, ఈ దాడిని చూసిన ప్రతి ఒక్కరూ ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఆర్టీసీ ఎమ్‌డి జోక్యం చేసుకొని దుండగుల్ని వెంటనే అరెస్ట్ చేసేలా చూడాలని, ఉద్యోగులకు మనోధైర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు రవిశంకర్, రామకృష్ణ, ఎన్ఎంయు నాయకులు అమర్‌నాథ్, ఇయు నాయకులు పాల్గొన్నారు.

**ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ఖండన**

హార్న్ కొట్టారనే కారణంతో ఆర్టీసీ బస్సును వెంబడించి డ్రైవర్‌పై అత్యంత దారుణంగా దాడి చేసిన అధికార పార్టీ దుండగులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు నన్నపనేని శివాజీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి, కఠిన చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే

8 లో

## కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

8 లో


రికవరీ చేసిన ఫోన్లు అందుకున్న బాధితులతో ఎఎస్‌పి సుప్రజ, ఇతర పోలీసు సిబ్బంది

## రూ.26.50 లక్షల ఫోన్లు రికవరీ

### 106 మొబైల్స్‌ను బాధితులకు అందించిన పోలీసులు

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

జిల్లా వ్యాప్తంగా చోరీకి గురైన రూ.26.50 లక్షల విలువచేసే 106 బ్రాండెడ్ మొబైల్ ఫోన్లను పోలీసులు రోజుల వ్యవధిలోనే రికవరీ చేశారు. వీటిని బాధితులకు గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ సుప్రజ శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అందజేశారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారి కోసం 8688831574 అనే వాట్సాప్ నంబర్‌ను పోలీసులు ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ఈనెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేస్తే ఓ అప్లికేషన్ ఓపెన్ అవుతుంది. అందులో ఫోనుకు సంబంధించిన వివరాలు పొందుపరిచి సెండ్ చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు లేకుండానే చోరీకి గురైన మొబైల్ ఫోన్లను జిల్లా ఐటీ కోర్ పోలీసులు రికవరీ చేస్తున్నారు. దీనిపై ఎఎస్‌పి సుప్రజ మాట్లాడుతూ మొబైల్ పోయిన వెంటనే సెయిర్ సిటిజెన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే ఫోన్‌లోని సమాచారం దుర్వినియోగం కాకుండా ఫోన్ బ్లాక్ అవుతుందని, ఫోన్‌ని ట్రాక్ చేసి రికవరీ చేయడం సులువుతుందని అన్నారు. జిల్లా ప్రజలే కాక ఇతర జిల్లాలు చెందిన వారు కూడా ఈ సేవలను వినియోగించుకోవచ్చని అన్నారు. ఎక్కువగా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ముంబై, ఢిల్లీలో ఈ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం పోయిన రూ.40 వేల ఫోన్‌ను తాను తిరిగి పొందడం సంతోషంగా ఉందని బాధితుడు ఉమామహేశ్వరరావు చెపాపరు. తాను పోగొట్టుకున్న ఫోన్‌ను 48 గంటల్లోనే ఇచ్చారని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో పనిచేసే డాక్టర్ సుష్మ ఆనందం వ్యక్తం చేశారు.

## అసమానతల్లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణభేరి

### 15న బహిరంగ సభ జయప్రదం కోసం కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో 15న నిర్వహించే ప్రజా రక్షణ భేరి జయప్రదం కోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం కరప త్రాలు ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఉండవల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమాన తల్లేని అభివృద్ధి కోసం సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా రక్షణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారన్నారు. బిజెపి, వైసిపి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయని, నిరసన తెలియజేయడానికి కూడా వీల్లేకుండా నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు బనాయి స్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ స్వార్ధ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను గాలికొదిలేశారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.భాగ్యరాజు, వి.వెంకటేశ్వ రరావు, ఇ.రామారావు, సిహెచ్.సుందరరావు, ఎస్‌కె పీరూసాహెబ్, కృష్ణ, బాబూరావు, కె.ఆంజనేయులు, కె.రామకృష్ణ, పార్ధసారధి, బక్కిరెడ్డి, పి.రాఘవులు, జానీ పాల్గొన్నారు.


ముప్పాళ్ల మండలం మాదలలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మాదల సిపిఎం కార్యాల యంలో పోస్టర్‌ను సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమర్ తదితరులు ఆవిష్కరించారు. సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడారు. నాయకులు కె.సాంబ శివరావు, ఎం.వెంకటరెడ్డి, జి.జాలయ్య, పి.సైదాఖాన్, నాగమల్లేశ్వరరావు, కె.నాగేశ్వర రావు, టి.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి, పెదకాకాని రూరల్**

ప్రజారక్షణ భేరి బహిరంగ

▶ 2లో

# కేంద్ర ప్రభుత్వ పథకాల పర్యవేక్షణకు దిశ కమిటీలు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేయడానికి , పర్యవేక్షించడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (DISHA) ఏర్పాటు చేసినట్లు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో అయోధ్య రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా దిశ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొన్నారు. ఉపాధి హామీ, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన, నేషనల్ హైవేస్, నాగరవాటికల ఏర్పాటు, ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన, 15 వ ఆర్థిక సంఘం నిధులు, సంసాద్ ఆదర్శ్ గ్రామ్ యోజన, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై సమీక్షించారు. అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ దిశా కమిటీలు 76 కేంద్ర పథకాలు, కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడం ద్వారా జిల్లాలను అన్ని స్థాయిలలో అగ్రపథంలో నిలపడానికి కృషి చేసేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం అవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా అందరూ కృషి చేయాలన్నారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల వద్ద ఉపాధి హామీ ద్వారా నర్సరీలు ఏర్పాటు చేయాలని, అమృత్ సరోవర్ పథకం కింద చెరువులు బాగుచేసి ప్లాంటేషన్ పనులు చేపట్టాలన్నారు. తెనాలి పట్టణంలో నగరవాటిక నిర్మాణానికి 9.8 ఎకరాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన క్రింద జిల్లాలో 2020-21లో రూ.3152 లక్షలతో 44.88 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టగా, అందులో నాలుగు రోడ్ల పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన మూడు రోడ్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. 2022-24 ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన క్రింద 23.576 కిలోమీటర్ల మేర రూ.2046.22 లక్షలలో చేపట్టనున్న నాలుగు రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా అనుమతులు మంజూరయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం నుండి పరిపాలన అనుమతులు అందాక టెండర్లు పిలుస్తామని పంచాయతీరాజ్ ఎస్ఇ బ్రహ్మయ్య తెలిపారు. సమావేశంలో జెడ్పీ సిఈఓ జె.మోహన్‌రావు, డీఆర్డీఏ, మెప్మా పీడీలు హరిహరనాథ్, వెంకట నారాయణ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపి ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మేడ్ నాయకులు

## ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిని అందరూ ఖండించాలి

ప్రజాశక్తి-గుంటూరు

కావలిలో ఆర్టీసి డ్రైవర్ బిఆర్‌సి సింగ్‌పై కొందరు దుండగులు సుధీర్, శివారెడ్డి, మల్లి, విల్సన్, కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ 'మేడ్' రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ కోరారు. దాడికి నిరసనగా శనివారం మేడ్ నాయకులు ఆర్టీసి అధికారుల్ని కలిసి వినతిపత్రం అందజేశారు. దేవపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులకు రక్షణ కరువైందన్నారు. ఉద్యోగులకు అండగా నిలిచే రాజకీయ నాయకులు కరువయ్యారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇటువంటి ఘటనలను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మేడ్ జిల్లా అధ్యక్షులు ఎం.సంగీతరావు, ఎల్.ఇమ్మానియేలు, పి.రవికుమార్ పాల్గొన్నారు.




నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

## దళిత బాలుడిని కొట్టిన పెత్తందారుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

దొంగతనం చేశాడనే నెపంతో దళిత బాలుడిని నిర్బంధించి, హింసించిన పెత్తందారి భూస్వామిని అరెస్ట్ చేయాలని స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వైఎస్‌ఆర్ జిల్లా, పల్లూరు మండలం, అంబవరానికి చెందిన దళిత బాలుడు సరుకుల కోసం దుకాణానికి వెళ్లగా, తమ ఇంట్లో దొంగతనం చేశాడంటూ విచక్షణా రహితంగా కొట్టి, గాయపరిచిన ఓబులురెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నానాటికి దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, నాయీబ్రాహ్మణ జెఎసి రాష్ట్ర కార్యదర్శి టి.నరసింహారావు, ఆర్‌పిఐ నాయకులు వి.ముత్తయ్య జి.శామ్యూల్ పాల్గొన్నారు.

## 4, 6 తేదీల్లో ఆర్టీసి అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయటానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటిఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సిన అభ్యర్థుల వివరాలు జిల్లాల వారీగా www.apsrtc.ap.gov.in వెబ్‌సైట్‌లో recruitment tabలో ఉంచినట్లు తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన అభ్యర్థులు నవంబర్ 4, 6 తేదీల్లో విజయవాడ, విద్యాధరపురంలోని చెరువు సెంటర్ వద్ద గల జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు ఉదయం 10 గంటలకు తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 7382900299, 7330776946, 7282903217 నంబర్లలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలని సూచించారు.

## మంత్రి మాట నీటి మూట

(మొదటి పేజీ తరువాయి)

పడకపోతాయా? సాగునీరు విడుదల చేయకపోతారా? అని ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీరు పెట్టుకుంటున్నారు.

సాగుదారుల్లో అధిక శాతం కౌలురైతులే కావడంతో పంటకు పెట్టుబడులతోపాటు కౌలుకూ అప్పులు చేసి చెల్లించారు. తీరా పైరుకు నీరందకపోవడంతో అదనపు ఖర్చునూ భరిస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో తామెంత నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందోనని, ఆందోళనకు గురవుతున్నారు. పొగాకు, మొక్కజొన్న పూర్తిగా ఎండుముఖం పట్టగా మిగిలిన పంటలు ఎండు దశకు చేరుకున్నాయి. ఆరు తడులకు నీరిస్తామని మంత్రి ప్రకటించకుండా ఉండివుంటే తాము పంటలేమీ వేసేవాళ్లం కాదని పలువురు రైతులు నిట్టూరుస్తున్నారు. తమను ఇంతగా ఇంతగా కష్టాల్లోకి నెట్టిన ప్రభుత్వం తమను ఆదుకోవాలని, నష్టాలకు బాధ్యత వహించి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

గత నాలుగేళ్లలో మిర్చికి బొబ్బర తెగులు, తామర పురుగు ఆశించగా పత్తిలో గులాబీరంగు పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు, ఇతర తెగుళ్లు వ్యాపించి రైతులను వరుసగా నష్టాల పాల్జేస్తున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చాక ఉమ్మడి గుంటూరు జిల్లాలో 80 మందికి పైగా రైతులు, కౌలురైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పంట నష్టపరిహారాలు చెల్లించి ఉంటే ఈ చావులన్నీ తప్పేవని రైతులు, రైతు నాయకులు చెబుతున్నారు. కనీసం మృతి చెందిన రైతు కుటుంబాలకు పరిహారమైనా ఇవ్వలేదని విమర్శిస్తున్నారు.

## అసమానతల్లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణభేరి

(మొదటి పేజీ తరువాయి)

సభ జయప్రదం కోసం స్వర్ణపురి కాలనీలో ప్రచారం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి ఎన్.శివాజీ, నాయకులు రామారావు, రాబర్ట్, ఆశ, బి.సాంబయ్య పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

మండలంలోని కాజలో సిపిఎం విస్తృత సమావేశం టి.ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. కాజాలో ఇళ్ల పట్టాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.కోటేశ్వరి, ఇ.నాగేందర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, కోటిరెడ్డి, మాధవరెడ్డి, రామారావు, బ్రహ్మారెడ్డి, శివయ్య, అప్పారావు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-సత్తెనపల్లి**

స్థానిక పుతుంబాక భవన్‌లో పోస్టర్లను సిపిఎం సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి డి.విమల, మండల కార్యదర్శి పి.మహేష్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు రోజురోజుకు కలవరపరుస్తున్నాయని అన్నారు. బిజెపి పాలనలో దేశం మొత్తం అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. బుల్డోజర్ రాజకీయాలతో ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తోందని విమర్శించారు. స్త్రీలను నడిరోడ్డు మీద నగ్నంగా ఊరేగించి విర్రవీగుతున్నారని మండిపడ్డారు. కార్మికులు హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లు తెచ్చారన్నారు. రైతు పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరించారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం కార్పొరేట్ సేవల్లో తరిస్తున్నారని అన్నారు. కృష్ణపట్నం, గంగవరం, మేజర్ పోర్టులతో పాటు రాష్ట్ర ప్రజల సంపదను ఒక్కొక్కటిగా అదానికీ నైవేద్యం పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపిని వైసిపి, టిడిపి, జనసేన ప్రశ్నించడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ విధానాల కోసం సిపిఎం పోరాడుతోందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.హరి పోతురాజు, ఆర్.పురుషోత్తం, పి.ప్రభాకర్, ఎ.వెంకట నారాయణ, ఎం.జ్యోతి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.










## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - మేడికొండూరు :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడికొండూరు మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి.అనిరుద్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంటి పరిసరాలు ప్రజలు పరిశుభ్రంగా పెట్టుకోవాలని, ఒళ్లు నొప్పులు, నీరసంగా ఉంటే వెంటనే వైద్యులను, లేదా ఎఎన్‌ఎం,ఆశ వర్కర్లను సంప్రదించి తగిన వైద్యం చేయించుకోవాలని సూచించారు. జ్వరాలను అశ్రద్ధ చేయకుండా వైద్యుల వద్ద చూపించుకోవాలన్నారు. పగటిపూట దోమ కాటు వల్ల మాత్రమే డెంగ్యూ సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, సాధ్యమైనంత వరకు ప్రజలంతా దోమతెరలు వాడాలని సూచించారు. మండలంలో మూడు డెంగీ కేసులు నమోదుకాగా ఒకరు పూర్తిగా కోలుకున్నారని, ఇద్దరు చికిత్స పొందుతున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి సహకరిస్తున్నారన్నారు.

## డిసెంబర్ 9లోగా అభ్యంతరాలు స్వీకరించాలి

**ప్రజాశక్తి-గుంటూరు :** ఓటర్ల ముసాయిదా జాబితాపై డిశంబర్ 9లోపు అభ్యంతరాలను తీసుకొని పరిష్కరించాలని బిఎల్‌ఓలను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ఇన్‌ఛార్జి) సిహెచ్.శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం ఆయన ఛాంబర్‌లో ఎన్నికల విధుల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ (ఇన్‌ఛార్జి) మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నెల 27కి ఓటర్ల ముసాయిదా జాబితా విడులైందని, ఈ జాబితాపై వచ్చే అభ్యంతరాలను పరిష్కరించి, తుది జాబితా తప్పులు లేకుండా వచ్చేలా చూడాలని అన్నారు. సూపర్వైజరి అధికారులు తమ పరిధిలోని బిఎల్‌ఓల వారిగా వచ్చే అభ్యంతరాలను నేరుగా పరిశీలించాలన్నారు. అభ్యంతరాలను ఎన్నికల విభాగంలో బిఎల్‌ఓల వారిగా రికార్డ్ నమోదు చేయాలని ఆ విభాగ సూపరిండెంట్‌ని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఓటర్లు నేరుగా తమ ఓటుని సంబంధిత బిఎల్‌ఓ లేదా పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో మేనేజర్ శివన్నారాయణ, సూపరిండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :** ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేశామని, ఓటర్లు తమ ఓటు జాబితాలో ఉన్నది లేనిది చూసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి హరిహరనాథ్ తెలిపారు. శనివారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం తహశీల్దార్ శ్రీకాంత్ కేథార్‌నాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై వచ్చే నెల 4, 5 తేదీలతో పాటు డిసెంబర్ 2,3 తేదీలలో ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభ్యంతరాలుంటే ఈఆర్వోలకు అందజేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయూమ్ అహ్మద్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ ఫణికుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

ఆది కవి, రామాయణ మహాకావ్య రచయిత మహర్షి వాల్మీకి జయంతి పురస్కరించుకొని శనివారం కలక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తంతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు.



కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి పూర్వ జీవితాన్ని ప్రస్తావిస్తూ అడవిలో వెళ్ళే బాటసారులను సంహరించి, వారి వద్ద ఉన్న విలువైన వస్తువులను అపహరించి తన కుటుంబాన్ని పోషించుకునేవారన్నారు. అనంతరం వారి జీవితంలో జరిగిన ఒక ఘటన తరువాత పశ్చాతాపం చెంది మహర్షి అయ్యారన్నారు. వాల్మీకి రచించిన రామాయణ కావ్యాన్ని కవియిత్రి మొల్ల తెలుగులో చక్కగా అనువదించారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ కె.చంద్రశేఖరరావు, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు , పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ ఎస్ఇ బ్రహ్మయ్య, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్స్ భిక్షాలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కూలి మృతి

ప్రజాశక్తి-గుంటూరు సిటి

కూలి పనుల నిమిత్తం వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. జి జి హెచ్ అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బ్రాడీపేట 4/17 కు చెందిన జాక్కిరెడ్డి వీరారెడ్డి (48) తాతిరెడ్డి పాలెంలోని జెహెచ్‌సికి కూలి పని నిమి త్తం శనివారం వెళ్ళాడు. పనికి వెళ్లిన ఇంటికి నీళు కొడుతూ ఉండగా మోటార్ కు పెట్టిన పైప్ నుండి నీళ్ళు లీక్ అవు తుండటంతో దానిని సరిచేసేందుకు ప్రయ త్నిం చాడు. ఈ క్రమంలో మోటార్‌ను పరిశీలించేందుకు పట్టు కోగా విద్యుత్ షాక్ తగిలి వీరారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జిజిహెచ్ కు తరలించిన తాడి కొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం**

విద్యుత్ షాకుతో అర్ధాంతరంగా మరణించిన వైసిసి కార్యకర్త కుటుంబానికి ప్రభుత్వ విప్, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి తక్షణ ఆర్థికసాయంగా లక్ష రూపాయలను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వీరారెడ్డి భార్యకు అందజేశారు. జిజివాచ్ మార్చురీలో ఉన్న వీరారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వీరారెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పరిశపోగు శ్రీనివాసరావు, పార్టీ నేతలు మాదాసు కిరణ్, గంగయ్య, డేవిడ్, నాగార్జున, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మృతుడి భార్యకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి




సర్టిఫికెట్లు అందిస్తున్న అడిషనల్ ఎస్పీ

## పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

జిల్లాలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పోలీసు అమరవీరుల సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం,రక్తదాన శిబిరాలను స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో జిల్లా పోలీస్ అధికారులు శనివారం నిర్వ హించారు. గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్, లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ , డాక్టర్ల బందం తో పాటు హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు ఆద్వర్యంలో ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా పోలీసులకు వైద్య పరీక్షలతో పాటు ,అందుకు తగిన మందులు పంపిణీ చేసినట్లు అదనపు ఎస్పీ లు శ్రీనివాసరావు, కె.కోటేశ్వరరావు తెలిపారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ రక్త దానం చెయ్యండి, చేపించండి ప్రాణాపాయ స్థితిలో వున్నవారికి ప్రాణం పోయాలని చెప్పారు. అనంతరం రక్తదానంలో పాల్గొన్న పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు.



## ప్రభుత్వ వైద్యశాలలో అన్నదానం

ప్రజాశక్తి-మాచర్ల

వేముల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేముల మణికుమార్ జయంతి సందర్భంగా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సహాయం పొందుతున్న వారికి శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేముల సుబ్బారావు, మణికుమార్, కిరణ్‌కుమార్‌ల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేయటం అభినందనీయమని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు ఉదయ బాను అన్నారు. వేముల మాధవి మాట్లా డుతూ గత మూడేళ్లుగా విద్యా, వైద్యపరంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. కార్య క్రమంలో ట్రస్ట్ కన్వీనర్ తుమ్మేపల్లి సాంబశివరావు, వాసవీ క్లబ్ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవ రావు తదితరులు పాల్గొన్నారు.

## 'బంగారుతల్లి' విద్యార్థినుల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రతీ మూడు నెలల కొకసారి హీమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించి హీమోగ్లోబిన్ శాతాన్ని తెలిపి ఆ వివరాలు బంగారుతల్లి ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేయడం జరుగు తుందని పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పట్టణం లోని డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించినట్లు పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం

- ఇద్దరు అరెస్టు
- రూ. 50 వేలు స్వాధీనం

ప్రజాశక్తి - వినుకొండ

అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సెబ్ సిఐ ఆర్. విజయభాస్కర్ శనివారం తెలిపారు. పల్నాడు జిల్లా సెబ్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శావల్యాపురం మండలం వేల్పూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఆటోను తనిఖీ చేయగా మద్యం బాక్సులు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. నిర్వాకులు పవన్ సాయి, అడివయ్య ఇద్దరిని విచారించగా ప్రకాశం జిల్లా సంతమాగులూరు అడ్డరోడ్డు ప్రభుత్వ మద్యం దుకాణం నుండి సూపర్‌వైజర్ గంగినేని శ్రీకాంత్ ఇచ్చిన మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తున్నట్లు తెలపడం జరిగిందన్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపలోకి తీసుకొని, 324 మద్యం బాటిల్లతో సహా రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. నిందితులను వినకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరపరచుగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్ శ్రీకాంత్ ని కూడా త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు.



## మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పల్నాడుజిల్లా

గురజాల నియోజకవర్గ పరిధిలోని జంగ మహేశ్వరపురం గ్రామంలో ఇటీవల హత్యకు గురైన కూనిరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబాన్ని శనివారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ కృష్ణారెడ్డిని హత్య చేసిన నిందితులు ఎంతటి వారైనా సరే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, కల్పలతా రెడ్డి, గురజాల వైసిపి నాయకులు పాల్గొన్నారు.



## ఐదుగురు మందుబాబులపై కేసు

ప్రజాశక్తి-తెనాలి

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేస్తూ ప్రజలకు ఆటంకం కలిగిస్తున్న ఐదుగురు వ్యక్తులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి జగ్గడిగుంటపాలెం, పరిమి డొంకలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న యువకులను ఐదుగురుని గుర్తించి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



అమరావతి మేజర్ కాల్వలో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

## బీడుగా మారిన పంట భూములు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా నాగార్జున సాగర్ కుడి కాల్వకింద 11 లక్షల ఎకరాల్లో పంట భూములు బీడు భూములు గా మారాయని టిడిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు అన్నారు. సాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరుతూ సత్తెనపల్లి పట్టణంలోని గుంటూరు రోడ్డులో వున్న ఎండిన అమరావతి మేజర్ కాల్వలో టిడిపి నాయకులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిపారుదల మంత్రి కాస్త నీటిపారుదల గురించి ఆలో చించాలంటూ అంబటి రాంబాబుపై విమర్శలు చేశారు. సాగర్ కాల్వలు చుక్క నీరు లేక పిచ్చి మొక్కలతో నిండిపోయాయని, పొలాలు మొత్తం ఎండిపోతున్నాయని అన్నారు. గతంలో చంద్రబాబు ముందు చూపుతోహరిచంద్రపురం నుంచి నకిరేకల్ వరకు చేసిన ఎత్తిపోతల పథకం వైసిపి ప్రభుత్వం అనాలోచితమైన చర్య తో ఆపడం వల్ల నేడు దాదాపుగా కుడికాలువ కింద 11 లక్షల ఎకరాలు బీడు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబును, లోకేశ్‌ను, పవన్ కళ్యాణ్ ను విమర్శించడం ఆపి రైతుల కష్టాలను చూసి సాగర కుడికాలువకు నీరు ఇచ్చే పనిలో ఉండాలని చెప్పారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్ ని ఎడారిగా మార్చిన ఘనత, అప్పుల ఊబిలో దించిన ఘనత వైసీపి ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కంబాల వెంకటేశ్వర రావు,పట్టణ కమిటీ కార్యదర్శి నూర్ బాషా జానీబాబు, ఉపాధ్యక్షులు శిఖా కొండలరావు,ఆదం సాహెబ్, మండల రైతు విభాగం అధ్యక్షుడు బండారుపల్లి నరసింహారావు, పట్టణ రైతు విభాగం అధ్యక్షులు పీలా సాంబశివరావు, ఉపాధ్యక్షుడు ఆళ్ల సీతారామయ్య, ఆరేపల్లి పెదబాబు,కలుమూరి సుబ్బారావు, పరిమి నాగేశ్వరరావు,పాల్గొన్నారు.



## తల్లీబిడ్డల అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - మంగళగిరి

తల్లీకుమారులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొల్లూరు మండలం దోనేపూడికి చెందిన గొరికేపూడి రోజా తన ఇద్దరు కుమారులతో దసరా సెలవులకని మంగళగిరి మండలం నిడమర్రులో నివాసం ఉంటున్న తన తల్లి ద్రాక్షావలి ఇంటికి వచ్చారు. పండుగ సెలవులు పూర్తి కావడంతో తిరిగి ఈ నెల 24వ తేదీన ద్రాక్షావలితో ఉంటున్న మందపాటి శ్రీను, రోజాను, ఆమె కుమారులు శామ్యూల్(4), ప్రేమ్ కుమార్ (2.5) లను మంగళగిరి బస్టాండ్ లో తెనాలి బస్సు ఎక్కించాడు. అయితే, రోజా తన పిల్లలతో స్వగ్రామం చేరలేదు. మూడు రోజులు పాటు బంధువుల ఇళ్లలో వారి ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. రోజా తమ్ముడు ఆళ్ళమూడి హానోక్ బాబు శనివారం మంగళగిరి పట్టణ పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పట్టణ పోలీసులు తెలిపారు. తల్లీబిడ్డల ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పట్టణ పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## తూనికలు,కొలతలు శాఖాధికారుల తనిఖీలు

ప్రజాశక్తి -నాదెండ్ల

మండల పరిధిలో కాటాలకు ముద్రలేని షాపులను గుర్తించి శనివారం తూనికల, కొలతలు శాఖాధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో ఎరువులు అధిక ధరకు విక్రయిస్తున్న కారణంగా మూడు షాపులపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీలు డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు నరసరావుపేట ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు.


బి.చందన, వి. ఆదిత్య


బి.చరణ్

## బేస్‌బాల్ జిల్లా జట్టుకు సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-క్రోసూరు

మేడికొండూరు మండలం మందపాడు జడ్పీ హైస్కూల్లో ఈరోజు జరిగిన బేస్ బాల్ జిల్లా జట్టు ఎంపికలో క్రోసూరు సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కి చెందిన విద్యార్థులు అండర్ – 14 బాలికల విభాగంలో బి చందన, బాలుర విభగంలో వి ఆదిత్య, అండర్ –17 బాలుర విభాగంలో బి .చరణ్‌లను నిర్వాహకులు ఎంపిక చేసినట్లు పిఇటి వెంకట్రావు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ మేరీ రజిత రాష్ట్ర స్థాయిలో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలబెట్టాలని, శక్తి వంచన లేకుండా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.



## విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు

ప్రజాశక్తి–పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ క్లాస్ లను శనివారం నిర్వహించారు.ఎన్.ఎం.ఎం.ఎస్,యషస్వి, కౌసల్ లాంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడే వెర్బల్,నాన్ వెర్బల్ రీజనింగ్, అర్థమెటిక్ లను విద్యార్థులకు ఐఐటి చెన్నై నుండి వచ్చిన బి.కళ్యాణ్ రెడ్డి,శ్యామ్ లు సులభతరంగా బోధించి వానిలోని మెలకువలను నేర్పించారు.ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ నిర్వహించారు. గెస్ట్ లెక్చరర్ గా ఇటీవల విజ్ఞాన్ యూనివర్సిటీ నుండి పీహెచ్.డి పొందిన ఇదే గ్రామానికి చెందిన డాక్టర్ షేక్ సాయిబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాస రెడ్డి, పీసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు బి.రమణ, బాజీఖాన్, అరుణ పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా తైక్వాండో పోటీలకు 'ధనలక్ష్మి' కాలేజీ విద్యార్థి

ప్రజాశక్తి–ఈపూరు



ఆల్ ఇండియా తైక్వాండో పోటీలకు మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి వై రవీంద్రారెడ్డి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు శనివారం తెలిపారు.ఈనెల 27వ తేదీన బాపట్ల జిల్లా చీరాలలోని వైఎ ప్రభుత్వ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాల పోటీలలో ప్రతిభ కనబరిచి ఆలిండియా పోటీలకు ఎంపికయ్యాడన్నారు. రాజస్థాన్ రాష్ట్రంలో ఎస్జెపిజెటి యూనివర్సిటీలో 87ం కేటగిరీలో నవంబర్ 2న జరిగే పోటీలలో వై రవీంద్రారెడ్డి పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.ఎంపికైన విద్యార్థిని కళాశాల సెక్రెటరీ,కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరి రావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్,ఎం సురేష్, ఎం. దాసు అభినందించారు.

# గుండెపోటుతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

- మృతుని కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారమివ్వాలి
- ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్



ప్రజాశక్తి-సత్తెనపల్లి

గుండెపోటుతో పని ప్రదేశంలో భవనిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లిలో శుక్రవారం ఉదయం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సెగ్గం శ్రీను (53)సత్తెనపల్లి పట్టణంలో గత 35 సంవత్స రాలుగా తాపీ మేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగి స్తున్నాడు. యథాప్రకారం వడ్డవల్లిలో బిల్డింగ్ నిర్మాణం పనులు భాగంగా రెండవ అంతస్తు పైకి వెళ్లి పనిచేస్తుండగా గుండెపోటుకు గురైన శ్రీను, పని ప్రదేశంలోనే కుప్పకూలి పోయాడు. దీంతో తోటి కార్మి కులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పట్టణంలోని స్వగృహానికి తరలించారు. అంత్యక్రియలు నిర్వహించారు.మృతుడు శ్రీనివాసరావు కుమారుడు గత ఏడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కాగా, శ్రీనుకు భార్య, కుమార్తె ఉన్నారు.

**శ్రీను మృతదేహానికి నివాళులు**

ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాద్‌రావు శనివారం శ్రీను మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతుడు సెగ్గం శ్రీను గత 35 సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడని అకస్మాత్తుగా శ్రీను మరణించ డంతో ఆయన కుటుంబం రోడ్డున పడకుండా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుండి శ్రీనివాసరావు కుటుంబానికి రూ.5 లక్షలపరిహారం చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీను మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో తోటి భవన నిర్మాణ కార్మికులు గోన కోటేశ్వరరావు, చిలకా శ్యామ్, యాసారపు జాకోబు,కన్నదార ప్రతాప్, దూళ విజయబాబు,పసుపులేటి అనిల్ కుమార్, రాజారపు తిరుపతిరావు,మరిఅదాసు,లాగా రాంబాబు, సెగ్గం శ్రీనివాసరావు, సంగెపు వెంకటేశ్వర రావు నివాళులర్పించారు.

# కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు నాక్ 'ఎ' గుర్తింపు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

కళాశాలల, యూనివర్సిటీల పనితీరు ఆధారంగా లభించే గుర్తింపునకు సంబంధించి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) గుర్తింపు తమ కళాశాలకు లభించడం తమకు ఎంతో గర్వ కారణంగా ఉందని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా నాతాని మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీలలో రెండు రోజుల పాటు కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో పర్యటించిన నాక్ బృందం తమ కళాశాలలో అవలంభిస్తున్న మౌలిక సదుపాయాలు, బోధన అంశాలు, తదితర విధానాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. శుక్రవారం అధికారికంగా కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ ప్రకటించారన్నారు.

తమ కళాశాలలో అమలు చేసే విద్యా బోధన విధానాలు, మౌలిక సదుపాయాల కల్పన , విద్యార్థులకు అందించే సదుపాయాలు తదితర విభాగాలలో



అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

నాణ్యతను పరీక్షించి దాన్ని ఆధారంగా గ్రేడ్ లు జారీ చేస్తుందని, దీనికి సంబంధించి తమ కళాశాలకు ఏ గ్రేడ్ రావడం తమకెంతో గర్వ కారణంగా ఉందన్నారు. నాక్ ఏ గ్రేడ్ సాధనతో తమ కళాశాల నిర్వహణపై మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి అధ్యాపకులను అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య పాల్గొన్నారు.


రక్త దానం చేస్తున్న పోలీసు

## ప్రజా రక్షణ కోసం ఎనలేని త్యాగాలు

### పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రెడ్ క్రాస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి మరియు ఇతర వైద్యుల సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజా రక్షణ కొరకు విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకుంటూ పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రక్త దానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడంతో సమానమని ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలబెట్టడం సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ ఐసిఐసిఐ బ్యాంక్ సౌజన్యంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ బ్లడ్ బ్యాంక్ వాహనాన్ని ఎస్పీ పరిశీలించారు. రక్త దానం చేసిన పోలీస్ అధికారుల్ని సన్మానించి,పోలీస్ సిబ్బందిని, ఆయా కళాశాల విద్యార్థులు మరియు స్థానిక యువకులను ప్రశంసా పత్రాలతో అభినందించారు. పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కొండవీడు ముక్కు చెవి గొంతు హాస్పిటల్ అధినేత డాక్టర్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్రరాజు, ఏఆర్ డిఎస్పీ చిన్నికృష్ణ,ఆర్ ఐ లు, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి వి యం శరత్ బాబు,బత్తుల మురళీ, డాక్టర్ సజన, రామాంజనేయులు, గెల్లి వీరా రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **యడ్లపాడు:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా యడ్లపాడు పోలీస్టేషన్ సిబ్బంది రక్తదానం చేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరస రావుపేటలో పోలీస్ శాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యడ్లపాడు పోలీస్టేషన్‌కు చెందిన



ఐదుగురు సిబ్బంది పాల్గొని స్వచ్ఛం దంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి సురేష్‌కుమార్ వారిని అభినందించారు.

# అండర్-19 హాకీ జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి–సత్తెనపల్లి రూరల్

ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో అండర్ 19 బాలబాలికల హాకీ జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగాయి.

చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల వ్యాయామ అధ్యాపకులు వై.పెద్దబ్బాయి పరిశీలకులుగా వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు కె.శ్రీని వాసరావు, తోక సోమనాథ్, కె.వెంక ట్రావు, ఫిజికల్ డైరె క్టర్లు గంపా శ్రీను, పి.శివరామకృష్ణ, లాకు పిచ్చయ్య, బి. అనిల్ దత్తా నాయక్, సిహెచ్.వి. నాగరాజు, వీరచంద్ర, భాస్కరరావు హాజరయ్యారు. **బాలురజట్టు:** ఎ.బాలయేసు, ఎం.రుషి, ఎం.శివ దుర్గా గణేష్, కె. రాహుల్, సయ్యద్ షాహిద్ అహ్మద్, షేక్ సుభాని, కె.ఉత్తేజ్, ఎం.శరత్ చంద్ర,


జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారులు

జె.ప్రవీణ్ కుమార్,కె.రాకేష్, పి.వెంకటేష్, పి. తేజ్ ప్రణీత్, బి. లక్ష్మి ప్రకాష్, కె.విజయ చోళుడు, డి.మధు మోహన్, షేక్ నజీర్, బి. వికాస్, ఎస్. దత్త సాయి. **స్టాండ్ బై:** షేక్ సమీర్, షేక్ సర్దార్, జి.అరుణ్. **బాలికల జట్టు:** బి. పావని సాయి, ఎన్. రమ్య,టి.స్రవంతి, సిహెచ్ లాస్య, పి.శివ బిందు, కె. శివనాగ అంజలి, ఎం. నీలిమ, జె.తనుశ్రీ, చట్టు జ్ఞాన శ్రీ అర్చన, వి.అఖిల,షేక్ ఆసిఫా, ఎ.హారిక, కె.వెంకట త్రివేణి, టి.జయలక్ష్మి, జి.కీర్తన, కె. మొహనలక్ష్మి, ఎం.వజ్ర వైడూర్య, డి.స్వరూప. **స్టాండ్ బై:** బి.అఖిల, కె. లక్ష్మి భవాని

## 'వైసిపి పాలనలో కొత్త ఉద్యోగాలు లేవు'

**ప్రజాశక్తి-తాడేపల్లి**

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ఒక్కరికి కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేదని ఎన్‌టిఆర్ అభిమాన సేవా సంఘం జాతీయ అధ్యక్షులు పాలెపు రామారావు, అక్కినేని సుబ్రమణ్యం విమర్శించారు. శనివారం పెనుమాకలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి రాకముందు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు స్థానికులకు మూడు వంతులు, బయట వారికి ఒక వంతు ఉద్యోగ హామీనిచ్చి నేడు మడం తిప్పారని ఎద్దేవా చేశారు. అమరరాజా వంటి పరిశ్రమలకు పొరుగు రాష్ట్రానికి పోయి రాష్ట్రంలోకి వారికి ఉద్యోగాలు కల్పించలేకపోయారని, రాష్ట్రంలో చదువుతున్న అనేక వేల మంది ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రతినెలా రాష్ట్రానికి సుమారు 400 కోట్ల రూపాయలు నష్టం జరుగుతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-గుంటూరు**

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నగర ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారం జరుగుతుందని, క్యాంప్‌లను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ అన్నారు. శనివారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గుంటూరువారి తోట, లాంచెస్టర్ రోడ్, మారుతినగర్, ముత్యాలరెడ్డి నగర్, ఆర్.అగ్రహారం, శ్రీనివాసరావుతోటల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు జరిగాయి. శ్రీనివాసరావుతోట, మారుతి నగర్ క్యాంప్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నగరంలో ఇంటిలో ఎవ్వరు అనారోగ్యంగా ఉన్నా వారికి మెరుగైన వైద్యం అందే వీలుందన్నారు. నగరంలో 29 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందుతోందని, జగనన్న సురక్ష క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, కార్పొరేటర్లు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## విఐటి సదస్సుకు జయప్రకాష్ నారాయణ

**ప్రజాశక్తి - తుళ్లూరు**

రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో 'భారతదేశంలో ఎన్నికల సంస్కరణలు - ఓటింగ్ ద్వారా యువతకు సాధికారత' అనే అంశంపై లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్.జయప్రకాష్ నారాయణ ప్రసంగించారు. విఐటి-ఏపి స్కూల్ ఆఫ్ లా, ఎలక్టోరల్ క్లబ్ సమన్వయంతో




శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నికల సంస్కరణలు గురించి, ఎన్నికల్లో యువత ప్రాధాన్యత గురించి వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వి కోటరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్‌చంద్ర ముదిగంటి, స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ బెనర్జీ చక్క, ప్రొఫెసర్ కీర్తిక సాహు పాల్గొన్నారు.

# 24 ఎంపిఎఫ్‌సి గోడౌన్ల నిర్మాణం పూర్తి

### కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి

**ప్రజాశక్తి-గుంటూరు**

జిల్లాలో మొదటి విడత కార్యక్రమంలో 24 మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ల (ఎంపిఎఫ్‌సి) నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. రెండవ విడతలో లక్ష్యంగా పెట్టుకున్న 29 గోడౌన్లకుగాను ఇప్పటికి 25 స్థలాలను గుర్తించామని, గోడౌన్ల ర్మాణాలకు అవసరమైన స్థలాలను త్వరలో గుర్తించి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో 29 మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లకుగాను 24 గోడౌన్ల నిర్మాణం పూర్తి అయ్యాయని, మిగిలిన 5 గోడౌన్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో వున్నాయని చెప్పారు. రెండో దశలో లక్ష్యంగా పెట్టుకున్న గోడౌన్లకు అవసరమైన స్థలాలను త్వరలోనే గుర్తించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు పాడి రైతులకు రోజువారి ఖర్చులకు స్వల్పకాలిక రుణాలు, పాడి గేదేల కొనుగోలు దీర్ఘకాలిక రుణాలు మంజూరుకు జిల్లాకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మండలాలు వారీగా లక్ష్యాలు కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటికే నిర్దేశించిన లక్ష్యాల మేరకు పాడి రైతులను గుర్తించి రుణాలకు దరఖాస్తులు చేయించారని, సహకార బ్యాంకు ద్వారా రుణాల మంజూరుకు ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఎంఇ బ్రహ్మయ్య, సిపిఒ శేషశ్రీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, పశుసంవర్థకశాఖ జేడీఏ జెపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మణిపాల్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్ స్క్రీనింగ్ సేవలు

**ప్రజాశక్తి-తాడేపల్లి**




మణిపాల్ ఆసుపత్రి ద్వారా 300 పైగా గ్రామాల్లో ఎనిమిది వేలకు పైగా కేన్సర్ స్క్రీనింగ్ సేవలు అందించినట్లు మణిపాల్ హెడ్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో సేవలు చేసి అరుదైన రికార్డు మణిపాల్ తన సొంతం చేసుకుందని చెప్పారు. విజయవాడ నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో కేన్సర్ సంబంధిత వ్యాధులను గుర్తించేందుకు అంకాలజీ బస్సు సర్వీసులను ఐదేళ్ల క్రితం ప్రారంభించినట్లు వెల్లడించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఈ బస్సు ద్వారా ప్రజలకు సేవలందించినట్లు వివరించారు. కేన్సర్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. రోగ నిర్ధారణను ముందస్తుగా గుర్తించడం ద్వారా సరైన చికిత్స, నివారణను సాధించడంలో సఫలీకృతం అవుతున్నట్లు తెలిపారు. నివారణ, స్క్రీనింగ్, రోగ నిర్ధారణ వంటి సేవలు ఒకే చోట అందించడం వల్ల రోగులకు సమయంతో పాటు నగదు ఆదా అవుతుందని, సర్జికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ పూర్తిస్థాయి విభాగాల్లో పేరున్న వైద్యులతో నిర్వహిస్తామని వివరించారు.

## నూర్ బాషాలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలి

**బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు**

**ప్రజాశక్తి - పొన్నూరు రూరల్**

రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది నూరుబాషా సామాజిక తరగతికి చెందిన వారున్నారని, వారికి చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దూదేకులను ఓటు బ్యాంకుగా చూడకుండా, విద్యా, రాజకీయ పరంగా అభివృద్ధి చెందేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. డెల్టా అధ్యక్షుడు కోటి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆదివారం గుంటూరు ముస్లిం కాలేజీలో జరిగే దూదేకుల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# ఎరువుల కొరత లేదు : ఎడిఎ

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు, తాడికొండ మండలాల్లో రైతులకు ఎరువులు అన్ని ప్రైవేట్ డీలర్స్, సొసైటీలు, రైతుభరోసా కేంద్రాల్లో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు గాయం శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి మండలంలో యూరియా 170 టన్నులు, కంప్లెక్స్ 215 టన్నులు, డిఎపి 113 టన్నులు, ఎస్ఎస్‌పి 69 టన్నులు, ఎంఒపి 65 టన్నులు అందుబాటులో ఉన్నాయని, తాడేపల్లి మండలంలో యూరియా 80 టన్నులు, కంప్లెక్స్ 118 టన్నులు, డిఎపి 15 టన్నులు, ఎస్ఎస్‌పి 15 టన్నులు, ఎంఒపి 17 టన్నులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తూళ్లూరు మండలంలో యూరియా 165 టన్నులు, కాంప్లెక్స్ 128 టన్నులు, డిఎపి 15 టన్నులు, ఎస్ఎస్‌పి 12 టన్నులు, ఎంఒపి 16 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, తాడికొండ మండలంలో యూరియా 123 టన్నులు, కంప్లెక్స్ 113 టన్నులు, డిఎపి 18 టన్నులు, ఎంఒపి 12 టన్నుల ఎరువులు అన్ని ప్రైవేట్ డీలర్‌ల వద్ద, సొసైటీలల్లో, అన్ని రైతుభరోసా కంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచడం కోసం ఎప్పటికప్పుడు ఎరువుల కొరకు ఇండెంట్స్ పెట్టాలని రైతు భరోసా సిబ్బందికి, అధికారులకు, సొసైటీలకు, ప్రైవేట్ డీలర్లకు ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు.



పొలాలను పరిశీలిస్తున్న ఏవో తదితరులు

## నేటి సాయంత్రంలోగా చివరి భూములకూ సాగునీరు : ఏవో

**ప్రజాశక్తి - చేబ్రోలు**

మండల కేంద్రమైన చేబ్రోలులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో సుద్దపల్లి వరి పొలాలకు నీరు అందక ఎండిపోతున్న పరిస్థితులపై అర్జీ వచ్చిన నేపథ్యంలో ఆయా పొలాలను సందర్శించామని మండల వ్యవసాయాధికారి బి.శ్రీనివాస్ నాయక్ తెలిపారు. సుద్దపల్లిలో పెద్దవడ్లపూడి కెనాల్ ఆయకట్టు కింద సాగు చేస్తున్న వరి పొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు అర్జీ ఇవ్వడంతో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మట్టుపల్లి సత్యనారాయణ, నారిశెట్టి రాఘవరావుతో కలిసి పరిశీలించామని చెప్పారు. పొలాలకు నీటి సరఫరా గురించి నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ విద్యావతి తెలిపిన సమాచారం ప్రకారం పెద్దవడ్లపూడి కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీటి సరఫరా విడుదల చేసినట్లు చెప్పారని అన్నారు. ఆదివారం సాయంత్రంలోగా కాల్వ చివరి భూముల వరకు నీరు అందుతుందన్నారని చెప్పారు.

## షూటిల్‌బాల్‌లో రాంప్రకాష్ ప్రతిభ

**ప్రజాశక్తి - తాడికొండ**

ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18, 19 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన అండర్-14 అంతర్ జిల్లాల పోటీల్లో తాడికొండలోని శ్రీ వెల్లంకి వెంకటప్పయ్య హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి మార్కంపూడి రాంప్రకాష్ ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం పి.దేవరాజు తెలిపారు. గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రాంప్రకాష్ జట్టును చక్కగా ముందుకు నడిపిస్తూ గెలుపులో కీలకంగా వ్యవమరించారని చెప్పారు. రాంప్రకాష్‌ను టోర్నమెంట్ నిర్వాహకులు ప్రత్యేక క్రీడాకారునిగా గుర్తించి బెస్ట్ ప్లేయర్ అఫ్ ది టోర్నమెంట్ బహుమని అందించినట్లు చెప్పారు. రాంప్రకాష్‌ను పిఇటి ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.



పతకాలు సాధించిన రాంప్రకాష్‌తో హెచ్‌ఎం దేవరాజు, పిఇటి శ్రీనివాస్

## బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

మహర్షి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమని అమరావతి వాల్మీకి సేవా సమితి సభ్యులు అన్నారు. శనివారం వాల్మీకి జయంతి సందర్భంగా యర్రబాలెం ఇండస్ట్రీ కాలనీలో వాల్మీకి దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న పోరాటం నేటికీ ఫలించలేదని, బోయలను ఎస్టీలో చేర్చేంతవరకూ ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నాయకులు ఎ.శివాజీ, స్వాతి, ఎం.వెంకటేశ్వర్లు, ఎన్.లక్ష్మయ్య పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీ బాధ్యత ఇఆర్వోలదే

- ఫారం 6,7, 8 లను వెంటనే పరిష్కరించాలి
- కొత్త దరఖాస్తులను 21లోగా అప్‌లోడ్ చేయాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో పల్నాడు కలెక్టర్‌శివశంకర్



సమావేశంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారి వినాయకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను బూత్ స్థాయి అధికారులు అందరికీ అందజేసి అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ప్రచు రించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివ శంకర్ అన్నారు. జిల్లా అధికారులు, ఎన్నికల అధికారులు, క్షేత్రాధికారులతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల జాబితా ప్రచురించినట్లుగా ధ్రువీకరణ పత్రాలను ఈఆర్వోలు (ఓటర్ల నమోదు అధికారులు) సంతకం చేసి పంపాలన్నారు. ఈఆర్‌వో నెట్, బిఎల్ఒ యాప్‌లు శనివారం ఓపెన్ అవుతాయని చెప్పారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపునకు సంబంధించిన ఫారం 6,7, 8 లను వెంటనే పరిష్కరించి అప్‌లోడ్ చేయాలన్నారు. కొత్తగా వచ్చే దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు విచారించి నవంబర్ 21వ తేదీలోగా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అంతే కాకుండా ఎన్నికల సంఘం ప్రకటించిన తేదీలలో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లో కచ్చితంగా అందుబాటులో ఉండాలని, ఫారం 6, 7, 8 లను స్వీక రించడంతో పాటు అవసరమైన వారికి సహాయం చేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో బిఎల్ఓ లకు కావలసిన అన్ని వసతులు సజా వుగా ఉన్నాయో లేదో పరిశీలించాలని అన్నారు. గతంలో ఏవైతే అభ్యంతరాలు, ఆరోపణలు వచ్చాయో వాటిని దృష్టిలో పెట్టుకుని అటువంటి లోటుపాట్లు, పొరపాట్లు లేకుండా తప్పనిసరిగా ఓటర్ల జాబితాను సరిచేసుకోవాల న్నారు. ఎవరైనా స్పందించకపోతే అటువంటి వారిపై వెంటనే క్రమ శిక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధి కారితో సంప్రదించి పరిష్కరి స్తామన్నారు.

## లింగ నిర్ధారణ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి

పల్నాడు జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం సమర్ధవంతంగా అమలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు ఉన్నతాధికారులను జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్.ఆర్ శం కరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రొప్రైట్ ఆథారిటీ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం -1994 ను సమర్ధవంతంగా అమలు చేయాలని, ఈ చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే చట్ట పరిధిలో శిక్షారులవుతారని హెచ్చరించారు.

జిల్లాలో ఇప్పటివరకు 156 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చట్టము పరిధి కింద అనుమతులు ఇవ్వబడ్డాయని, వీరందరూ కూడా చట్టం ప్రకారం అన్ని రికార్డులను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా 6 స్కాన్ సెంటర్లకు, 5 రెన్యువల్స్ కు, మార్పుల కోసం నమోదు చేసుకున్న వారికి లింగ నిర్ధారణ చట్టం కింద అనుమతులు మంజూరు చేశారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఒ బి.రవి , నోడల్ అధికారిణి డాక్టర్ బి. గీతాంజలి,రెడ్ క్రాస్ సొసైటీ సభ్యు రాలు డాక్టర్ ఎం. వసంత కిరణ్, పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రవిచంద్ర, నరసరావుపేట డిఎస్పీ కెవి మహేష్, డిప్యూటీ డిఎంఅండ హెచ్ఒ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్. నాగపద్మజ, డాక్టర్ హనుమకుమార్, షేక్ ఖాజావలీ పాల్గొన్నారు.



## గాదెవారిపాలెం సర్పంచ్‌గా అన్నపూర్ణ

ప్రజాశక్తి- క్రోసూరు

గ్రామాలను అబివృద్ధి చేసుకునేందుకు అందరు కలసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు మండలం గాదెవారిపాలెం నూతన సర్పంచ్ గా ఎన్నికైన దండెబోయిన అన్నపూర్ణ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటివరకు సర్పంచ్ గా పని చేసిన సత్యనారాయణరెడ్డికి మండల స్థాయిలో బాధ్యతలు అప్పజెబుతామన్నారు. సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసిన అన్నపూర్ణని గ్రామాబివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన తర్వాత పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తెప్పించి.. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో ఆలయాన్ని అబివృద్ధి చేసేందుకు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేస్తునట్టు ప్రకటించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఇ.సాంబిరెడ్డి, వైస్ చైర్మన్ జి.దాసు, ఎంపిపి పి. కోటయ్య, జడ్పీటీసీ జమీలా గఫూర్, రాష్ట్ర షేక్ కార్పొ రేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్, సత్యనారాయణరెడ్డి, ఈవోపీఆర్డీ, ఎ.కోటిరెడ్డి, టి.అప్పిరెడ్డి పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- క్రోసూరు

మండలంలోని గాదెవారిపాలెంలో రూ.21.80 లక్షలతో నిర్మించి రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, అందుకే ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు అవసరమైన సలహాలు, సూచనలతో పాటు ఎరువులు, విత్తనాలు అంద జేస్తున్నామన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్లను ప్రారంభించారు.

## జాబ్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- క్రోసూరు

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగం, ఉపాధి అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శనివారం క్రోసూరు జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ జాబ్ మేళాలో పదో తరగతి నుంచి అర్హతకు తగ్గ ఉద్యోగాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. నిరు ద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా క్రోసూరు పాలిటెక్నిక్ కాలేజ్‌లో అనేక కోర్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంప్యూటర్ కోర్సులతో పాటు ఎలక్ట్రిక్, మగ్గం, ఎంబ్రాయిడరి వంటి అనేక రంగాల్లో శిక్షణ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి- క్రోసూరు

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట అభయ హస్తమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు రూ.12.40 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య అవసరాలకు పెద్దమొత్తంలో ఖర్చు పెట్టలేని పేదలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం పొందవచ్చని తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి ఖండన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం.హరిపోతు రాజు ఒక ప్రకటనలో ఖండించారు. కేసు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆర్టీసీ డ్రైవర్ పైన జరిగినటువంటి దాడిని సిరియస్ తీసుకోవాలని దాడి చేసినటువంటి రాజకీయ నాయకులపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. **చిలకలూరిపేట:** నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై శుక్రవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సిఐటియు మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు శనివారం అన్నారు.

స్థానిక పండరి పురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెంగళూరు నుంచి విజయవాడకు వచ్చే బస్సు డ్రైవర్ కావలిలో హారన్ కొట్టారనే కారణంతోనే ఈవిధంగా దాడిచేయడం ఎంతవరకు సబబు అని అన్నారు. కారులో వెంబడించి మరి బస్సు డ్రైవర్‌ను కొట్టారని, దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టి కఠిన శిక్షలు విధించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి ఘటనలు జరగకుండా చూడా లని డిమాండ్ చేశారు.




వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం తదితరులు

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఎస్పీ వై. రవి శంకర్ రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా జిల్లా ఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) రామ చంద్ర రాజు,డిఎస్పీలు, సీఐలు,ఆరైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హాలులో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం హాజరయ్యారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల శాఖాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **సత్తెనపల్లి రూరల్:** సత్తెనపల్లి పట్టణంలోని 12వార్డులో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయండి

ప్రజాశక్తి-రొంపిచర్ల



మాట్లాడుతున్న ఎంపిపి బాలనాగమ్మ

మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అధికారులు సక్రమంగా అమలు జేయాలని ఎంపిపి గడ్డం బాల నాగమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎండిఓ కె.మ్యాథ్యూబాబు అధ్యక్షత వహించారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేసి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని , గ్రామ వాలంటీర్లు అధికారులు, ప్రజాప్రతి నిధులు, అధికారులతో సమన్వయంగా ఉండాలని అన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని కోరారు. అనంతరం మ్యాథ్యూబాబు మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివ రించారు. సమావేశంలో తహశీల్దార్ జి.అంకారావు, ఆర్ ఐ కె. సుబ్బారావు, పంచాయతీ రాజ్ ఎఇ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## చంద్రబాబు హత్యకు జగన్ కుట్ర : టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ

మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు హత్యకు సీఎం జగన్ మోహన్ రెడ్డి కుట్ర పన్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జైల్లో చంద్రబాబు నాయుడు కు ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రికి అనుమతి ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు వ్యక్తిగత వైద్యులతో మందులు వాడాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రాణానికి ఏదైనా ముప్పు వాటిలితే అందుకు పూర్తి బాధ్యత జగన్, వైసిపి ప్రభుత్వానిదేనని హెచ్చరించారు.

## టిడిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-పెదకూరపాడు

వైసిపి ప్రభుత్వం ఓటమి భయంతోనే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేయటం జరిగిందని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం పెదకూరపాడు లోని సాయి శ్రీనివాస కళ్యాణ మండపంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశానికి పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు రమేష్ అధ్యక్షులు వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ బెదిరించి భయపెట్టి ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని ఆరోపించారు. అన్నారు. రానున్న వంద రోజుల్లో పార్టీకి ప్రచారం చేయాలన్నారు.

## ఆలయాల నిర్మాణానికి నగదు

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలోని పలు చర్చిల నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి శనివారం పాస్టర్లుకు నగదు అందజేశారు. 16వ వార్డు పాస్టరు యాకోబ్ ఇంటి వద్ద చర్చి నిర్మాణానికి రూ 3లక్షలు, 8వ వార్డులో పాస్టర్ దానియేలు ఇంటి వద్ద చర్చి నిర్మాణానికి రూ 9.37లక్షల గ్రాంట్‌ను పాస్టరుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రార్ధనాలయాల నిర్మాణానికి తమ వంతు సహకారం ఎప్పుడు అందిస్తామన్నారు.



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ వి.దేవిక వాణి

## క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక మారీస్‌పేట రావి రవీంద్రనాథ్ నగర్‌లోని సిఎం కాలని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు మారీస్‌పేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.దేవికవాణి ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెనాలి జిల్లా వైద్యశాల టిబి యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు ఉన్నవారికి కళ్లె సేకరించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో పరీక్ష నిర్వహిస్తున్నామని, ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ, వ్యాధిగ్రస్తులకు స్టేట్ బ్యాంక్ వారి ఆర్థిక సహాయంతో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జి.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి ఎ.బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, హెల్త్ విజిటర్ ఎన్.లక్ష్మి, డి.విజయకుమారి, టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య సురక్ష ప్రజలకు మేలు

ప్రజాశక్తి తెనాలి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తెనాలి పురపాలక సంఘ కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు అన్నారు. స్థానిక రావి రవీంద్రనాథ్ నగర్‌లోని చంద్రబాబునాయుడు కాలనీ స్పెషల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. డాక్టర్ వి.దేవికావాణి, డాక్టర్ సిహెచ్ గాయత్రీదేవి, డాక్టర్ వి.మోనిక, డాక్టర్ టి.భార్గవి, డాక్టర్ వి.మహిత వైద్య సేవలు అందించారు. జనరల్ ఓపీ 92 మంది, ఆర్థోపెడిక్ 22 మంది, సైకియాట్రిక్స్ 20 మంది, ఆప్తమాలజి 45 మంది నమోదైంది. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ టి.శిరీష, డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం, ఎఎంఒ సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఉమాకాంత్, వి.పున్నారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.సౌజన్యశ్రీ పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి - తాడికొండ

నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలోని శాఖ గ్రంథాలయం మహిళా గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి జి.శ్రీనివాసరావు, ఎ.మల్లేశ్వరి, రైతు సంఘం నాయకులు సిహెచ్. భాస్కరరావు, పి.హనుమయ్య, ఎన్.చలపతిరావు, సత్యానారాయణ, అప్పారావు, రంగారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## ఆర్‌డిఒను కలిసిన జెడ్‌పిటిసి సిద్ధయ్య

ప్రజాశక్తి - మేడికొండూరు

గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీకర్‌ను మేడికొండూరు జెడ్‌పిటిసి కందుల సిద్ధయ్య శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పలు అంశాలను ఆర్‌డిఒ దృష్టికి తెచ్చారు. ఆర్డీవోను కలిసి వారిలో వైసిపి నాయకులు యు.ప్రభాకర్, పేరేచర్ల సొసైటీ ప్రెసిడెంట్ షేక్ గాలిబ్ ఉన్నారు.



# 9వ తేదీ నుండి వార్డుల వారీగా 'పల్లెకుపోదాం'



సమావేశంలో ఇన్‌ఛార్జి కమిషనర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు

ప్రతి వార్డు సచివాలయం పరిధిలో 'పల్లెకు పోదాం' కార్యక్రమ విజయవంతానికి కార్యదర్శులు భాధ్యత తీసుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ పివికె భాస్కర్ అన్నారు. కార్యక్రమ నిర్వహణపై శనివారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 9 నుండి డిసెంబర్ 8 వరకు అన్ని వార్డ్, గ్రామ సచివాలయాల్లో 'పల్లెకు పోదాం' కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు సచివాలయాల్లో ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు, రానున్న పథకాలను స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజలకు తెలియజేయాలన్నారు. సచివాలయం పరిధిలోని లబ్ధిదారుల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను పథకాల వారిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హత ఉండి ఇంకా ఎవరికైనా అందకుండా ఉంటే వారికి వెంటనే అందించేందుకు 'పల్లెకు పోదాం' కార్యక్రమం ద్వారా దోహదపడుతుందని, కార్యదర్శులు, వాలంటీర్లు కార్యకమం గూర్చి స్థానిక ప్రజలకు తెలియచేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే సచివాలయాల వారిగా నోడల్, సూపర్వైజరి అధికారులను నియమించామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ఇన్‌ఛార్జి) సిహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, సూపరిండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

# డిసెంబర్‌లో కామర్స్ విభాగం జాతీయ సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 16, 17 తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి డాక్టర్ బట్టు నాగరాజు తెలిపారు. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ను శనివారం వీసీ పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాణిజ్యం, నిర్వహణలో ఉద్భవిస్తున్న సమస్యలు -అంతర్జాతీయ పోటీ తత్వానికి గల సవాళ్లు, వ్యూహాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు నాగరాజు చెప్పారు. విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, పరిశోధకులు నుంచి పరిశోధన పత్రాలు ఆహ్వానిస్తున్నామని అన్నారు. పరిశోధన పత్రాలు సమర్పించేవారు నవంబర్ 25 లోగా పంపించాలని, రిజిస్ట్రేషన్ డిసెంబరు 5వ తేదీ వరకు గడువు నిర్ణయించినట్లు వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాద్‌మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సిద్దయ్య, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎన్.రత్నకిషోర్, డాక్టర్ వి.విష్ణు, డాక్టర్ కె.సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌తో కెఎల్‌యు అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు శనివారం తెలిపారు. యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వర్శిటీలోని న్యూ సెమినార్ హాలులో జరిగిన రక్తదాన అవగాహనా సదస్సుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రక్తదానం చేసిన విద్యార్థులు ఒక వ్యక్తి నిండు ప్రాణంతో పాటు ఒక కుటుంబానికి భరోసా కల్పించిన వారవుతరని అన్నారు. రక్తదానం చేసిన వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఇచ్చే సర్టిఫికెట్ విద్యార్థులకు ఉద్యోగ అన్వేషణ సమయంలో చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతిఒక్కరూ రక్త దానం చేయవచ్చన్నారు. ఇక నుండి ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటగా యాప్ డౌన్లోడ్ చేసి, లాగిన్ అయ్యి రక్తదానం చేయడమే ఆధునిక టెక్నాలజీకి కొత్త మలుపు అని చెప్పారు. ప్రయివేటు విద్యాసంస్థల జాబితాలో కెఎల్ వర్శిటీ విద్యార్థులు రక్త దానం చేయడంలో ముందంజలో ఉన్నారని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ చేపట్టే కార్యక్రమాల్లో కెఎల్ యూవర్సిటీ విద్యార్థులందరూ పాలుపంచుకునే విధంగా తాము సహకారం అందిస్తామని చెప్పారు. తమ వర్శిటీలో సాక్, ఎన్ఎస్ఎస్, సిఇఎ, ఎస్.విఆర్ వంటి పలు రకాల క్లబ్‌లు ఆయా గ్రామాలలో ప్రజలకు సేవలందిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి మనుమంతురావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, యూత్ రెడ్‌క్రాస్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కె.సుకీర్తి, సత్యన్నారాయణ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కెఎల్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తదితరులు



## ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 140 పోలింగ్ కేంద్రం నుండి 201 పోలింగ్ కేంద్రాల వరకు ఓటర్ల ముసాయిదా జాబితాను శనివారం ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రకటించినట్లుగా అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. చేర్పులు, మార్పులకు డిసెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు.



## ఓబీసీ సదస్సుకు తరలిరండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరులోని ఏటుకూరు రోడ్డు వివాహ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగే ఏపీసీసీ ఓబీసీ సదస్సుకు బీసీలు తరలిరావాలని కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి షేక్ సలీం పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఆదివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి సదస్సుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కాపు సాధికారిక చైర్మన్ ఆర్.హనుమంతరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కె.కృష్ణారావు చౌదరి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు డి.శామ్యూల్, నాయకులు జి.సాంబశివరావు, శివాజి పాల్గొన్నారు.



## 50 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు

కొత్తరెడ్డిపాలెంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు స్నేహ హస్తాలు పౌండేషన్ చైర్మన్ ఎంవి రావు, సభ్యులు శివరాం పుస్తకాలు, పెన్సిళ్లు, ఆట వస్తువులను శనివారం బహూకరించారని హెచ్‌ఎం రవీంద్రబాబు తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 ఏళ్ల నుండి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## తక్కువ ధరకే డోర్ డెలివరీ

ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్



ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆర్టీసీ బస్ డిపోలో పార్సిల్, కొరియర్ సర్వీసులకు సంబంధించిన డోర్ డెలివరీ సదుపాయాన్ని తక్కువ ధరకే కల్పిస్తున్నట్లు తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ శనివారం ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 26 నుండి నవంబర్ 25 వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు జరుగుతాయని, తెనాలి పరిసరప్రాంత ప్రజలు మసోత్సవాల ఆఫర్‌ను వినియోగించుకోవాలని కోరారు. కేవలం రూ.70కే పార్సిల్ బుకింగ్ చేసుకోవచ్చని, కొరియర్ సర్వీసులను కూడా రూ.70తో డోర్ డెలివరీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఓబీసీ జనగణన కార్యాచరణపై నేడు సదస్సు

ప్రజాశక్తి - గుంటూరు సిటి

ఓబీసీ జనగణ కార్యచరణపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓబీసీ ముఖ్య నాయకుల సమావేశం గుంటూరు నగరంలో ఏటుకూరు రోడ్డులోని వివాహ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు చెప్పారు. ఈ మేరకు నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు అజిత్‌సింగ్‌తో పాటు రఘువీరారెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఓబీసీ జనగణనపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో కార్యచరణ రూపు దిద్దుకుంటుందన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతి కాంగ్రెస్ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, జిల్లా అధ్యక్షులు ఎల్.ఈశ్వరరావు, నాయకులు మహమ్మద్ ఉస్మాన్, అలా హాస్పిటల్ ఎమ్‌డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ ఈత పోటీల్లో తాడేపల్లి వాసి ప్రతిభ

ప్రజాశక్తి-తాడేపల్లి

దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ ఈత పోటీల్లో తాడేపల్లి సుందరయ్య నగర్ మానససరోవరం నిర్వాహకులు కళ్లం రామిరెడ్డి సత్తా చాటారు. హేమర్ స్పోర్ట్స్ ఎగ్జిబిషన్ ఆర్గనైజేషన్ రెండు రోజుల క్రితం నిర్వహించిన ఈత పోటీల్లో రెండు రజత, మూడు కాంస్య పతకాలు కైవసం చేసుకుని తెలుగువాడి సత్తా చాటారు. 72 ఏళ్ల వయసులో ఈ ఫీట్ సాధించడం ఆనందంగా ఉందని రామిరెడ్డి చెప్పారు. 50, 100 మీటర్ల ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్ విభాగాల్లో పతకాలు తన సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ తమనకు 58 ఏళ్లు వచ్చే వరకు ఈత అంటే భయంగా ఉండేదని చెప్పారు. ఆ తరువాత ధ్యానంతో పాటు ఈత చేయడం ప్రారంభించిన నాటి నుంచి సాధన చేసి రాణిస్తున్నాని అన్నారు.

## వరల్డ్ యూనివర్సిటీ పోటీలకు సాదియా ఆల్మాస్

ప్రజాశక్తి - మంగళగిరి



స్లొవేకియా దేశంలో ఈనెల 30వ తేదీ నుండి వచ్చే నెల నాలుగో తేదీ వరకు జరిగే వరల్డ్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలకు మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ షేక్ సాదియా ఆల్మాస్ ఎంపికైనట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. పోటీల్లో మంచి ప్రతిభ చూపి పతకాలు సాధించాలని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ఓల్గా నవల పంపాతీరంపై చర్చ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన భిన్నస్వరాలు సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహించే ఆహ్వాన లక్ష్మి సంస్మరణ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ హాల్లో స్త్రీవాద రచయిత్రి ఓల్గా రచించిన 'పంపాతీరం' నవలపై చర్చించారు. జిఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో ప్రముఖ కవి, కవితా సంపాదకులు బండ్ల మాధవరావు మాట్లాడుతూ స్త్రీవాత సాహిత్యంలో ఓల్గా దిట్టని కొనియాడారు. ఐదున్నరేళ్లపాటు విలక్షణంగా ఆహ్వానం మాసపత్రిక నిర్వహించి ఆహ్వానం లక్ష్మిగా పేరొందిన ఆమె పేరిట ప్రతినెలా చర్చాగోష్టి నిర్వహించటం అభినందనీయమన్నారు. విరసం అరసవెల్లి కృష్ణ మాట్లాడుతూ ఓల్గా రచనా శైలిని, పంపాతీరం నవల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పిల్లి వాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవి మాధవరావు

# మన ఆరోగ్యం మన చేతుల్లోనే

- స్ట్రోక్ అవగాహన కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్టులు
- పెద్ద ఎత్తున పక్షవాతం స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, జీవన విధానంలో తగిన మార్పులు చేసుకుంటే పక్షవాతం బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చని నగరంలోని పలువురు ప్రముఖ న్యూరాలజిస్టులు పేర్కొన్నారు. ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ సహకారంతో బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్ట్రోక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలో ప్రముఖ న్యూరాలజిస్టులు డాక్టర్ రమాతారక్‌నాథ్, డాక్టర్ పి.విజయ, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ సిహెచ్.శివరామకృష్ణ డాక్టర్ వందనపు నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత స్ట్రోక్‌కు దారి తీసే ప్రమాద కారకాలపై ఉచిత ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు.

కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి పరీక్షలు చేయించుకున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విజయ, రమాతారక్‌నాథ్


సదస్సుకు హాజరైన ప్రజలు

పరీక్షలతోపాటు ప్రతి ఒక్కరికీ వారు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై, ఆహారంపై పలు తగిన సూచనలు చేశారు. వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఎస్.శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ రమాతారక్‌నాథ్ మాట్లాడుతూ షుగర్‌ను నియంత్రిస్తే 80 శాతం పక్షవాతం రాకుండా నియంత్రించొచ్చని అన్నారు. డాక్టర్ పి.విజయ మాట్లాడుతూ ఏడాదికి పది కోట్ల మంది దీని బారిన పడుతున్నారని, అయితే వీటిల్లో 90 శాతం నివారించదగినవేనని చెప్పారు. ముఖ్యంగా పక్షవాతం నివారణకు అవగాహన చాలా ముఖ్యమని చెప్పారు. దీన్ని నియంత్రించలేకపోతే 2050 నాటికి వ్యాధి బారిన పడే వారి సంఖ్య రెట్టింపయ్యే ప్రమాదం ఉందని పలు నివేదికలు చెబుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో శారీరక శ్రమ తగ్గి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వైద్యం ఖరీదైన ఈ తరుణంలో నగరంలోని ప్రముఖ న్యూరాలజిస్టులు స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమంలో, పరీక్షలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. సదస్సుకు హాజరైన ప్రజలు వెలిబుచ్చిన సందేహాలను వైద్యులు సవివరంగా నివృత్తి చేశారు. కారక్రమాన్ని ప్రజారోగ్య వేదిక నాయకులు ఎల్.ఎస్.భారవి, ప్రజారోగ్య వేదిక జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ప్రజారోగ్యవేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎ.సత్యనారాయణప్రసాద్ పర్యవేక్షించారు.

# కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

## పలుచోట్ల పారిశుధ్య కార్మికుల నిరసన


మంగళగిరి మండలం యర్రబాలెంలో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మున్సిపల్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయడంతోపాటు వారి కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నాడు పని విరామ సమయంలో మండలంలోని ఎర్రబాలెంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఎం.రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తూ, వారికి చాలీచాలని జీతాలు ఇస్తున్నారని అన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు హామీనిచ్చారని గుర్తు చేశారు. కార్మికులకు కేవలం రూ.12 వేల జీతామే ఇస్తున్నారని, ఇవి ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. వేతనాల పెంపుదల, మధ్యంతర భృతి, కరువు భత్యం, హెచ్‌ఆర్‌ఎ అమలు చేసేందుకు ఇచ్చిన జీవో 1615 అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

మున్సిపల్ కార్మికులందరికీ సమగ్ర చట్టం తేవాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి డిమాండ్ చేశారు. పెనుమాకలో శనివారం పని విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఆర్.వేణు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని బంగ్లా సెంటర్ నుండి పోలీస్ స్టేషన్, సినిమా హాల్ సెంటర్ వరకు మున్సిపల్ కార్మికులు ర్యాలీ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే పారిశుధ్య కార్మికులందర్నీ పర్మినెంట్ చేస్తానని ప్రతిపక్షనేతగా జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని, ఈ పనిని రూ.లక్షలిచ్చినా ఎవరు చేయలేరని అన్నారని గుర్తు చేశారు. అయితే ఇప్పటికీ హామీని నెరవేర్చలేదన్నారు. పారిశుధ్య కార్మికులకు ఉరితాడుగా మారిన ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. 11వ పిఆర్‌సి ప్రకారం వేతనాలివ్వాలని, చెప్పులు, సబ్బులు నూనెలు, యూనిఫామ్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. కె.సీతారామయ్య, బి.రామారావు, ఎం.ప్రతాప్, పి.సురేంద్ర, జి.నాగేశ్వరరావు, అనంతలక్ష్మి, మార్తమ్మ, జయేంద్ర, డి.పరమేశ్వరరావు, వెంకట్రావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు